కరపత్రం

SINCE 2014

బుధవారం సెప్టెంబర్ 09, 2026 సంపుటి : 2 సంచిక : 329 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన డిప్యూటీ సీఎం
- స్పీకర్‌ను అవమానించడం అంటే సభ మొత్తాన్ని అవమానించడమే
- బీఆర్ఎస్ సభ్యులు యావత్ చట్టసభను అవమానించారని ఆరోపణ
- తాతా మధు, నవీన్ రెడ్డిపై చర్యలకు సభ తీర్మానం
- ఫ్యూడల్ భావజాలం నుంచే బీఆర్ఎస్ పుట్టింది: భట్టి
- తీర్మానాన్ని మండలి ఛైర్మన్‌కు పంపాలని నిర్ణయం

హైదరాబాద్:
స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ వ్యాఖ్యలతో బీఆర్ఎస్ భావజాలం, ఆలోచన స్పష్టంగా అర్థమవుతోందని తెలిపారు. ఈ రోజు మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ఇది స్పీకర్‌కు కాదు సభకు జరిగిన అవమానం అని తెలిపారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సభ తీర్మానించిందన్నారు. యావత్ చట్టసభనే బీఆర్ఎస్ సభ్యులు అవమానించారు. సభాపతిని అంటే సభ మట్టుత్తాన్ని అన్నట్లే దళిత వర్గాల్లో పుట్టి ఎదిగి వచ్చిన వ్యక్తి స్పీకర్ గడ్డం ప్రసాద్ అని తెలిపారు. ఫ్యూడల్ విధానం మీద పోరాడిన చరిత్ర ఈ సభకు ఉందన్నారు. ఫ్యూడల్ భావజాలం నుంచి పుట్టిందే బీఆర్ఎస్ అని ప్రస్తుతం ఫాంహౌజ్ కుట్ర నడుస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాతా మధు, నవీన్ రెడ్డిలపై చర్యలకు మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని భట్టివిక్రమార్క బలపరిచారు. తీర్మానాన్ని మండలి ఛైర్మన్‌కు పంపాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు

యువ ఫిలిం మేకర్స్‌కు బతుకమ్మ ఛాలెంజ్

'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026' పోస్టర్ ఆవిష్కరణ

- ఛాలెంజ్‌ను సద్వినియోగం చేసుకోండి: కోమటిరెడ్డి
- షార్ట్‌ఫిలింలు, పాటలు, వీడియోలతో ప్రతిభకు వేదిక
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై సృజనాత్మకతకు అవకాశం
- యువత, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పాల్గొనాలని పిలుపు
- బతుకమ్మ విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడమే లక్ష్యం
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహనకు దోహదం

2 లో

బీఆర్ఎస్‌కు పార్టీగా కొనసాగే అర్హత లేదు: మహేష్ గౌడ్

- బీఆర్ఎస్ గుర్తింపు రద్దు చేయాలి: టీపీసీసీ చీఫ్
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- తాతా మధుతో కేసీఆర్ అలా మాట్లాడించారని ఆరోపణ
- బీఆర్ఎస్ దళిత, గిరిజన వ్యతిరేక పార్టీ: మహేష్ గౌడ్
- స్పీకర్‌ను అవమానించడం రాజ్యాంగబద్ధ పదవిని అవమానించడమేనని వ్యాఖ్య
- తాతా మధు వ్యాఖ్యలపై మండలిలో మహేష్ గౌడ్ ఆగ్రహం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీని తక్షణమే డిస్మిస్ చేయాలని కాంగ్రెస్ డిమాండ్

హైదరాబాద్:
ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ కు రాజకీయ పార్టీగా కొనసాగే అర్హత లేదని.. ఆ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని కోరారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్?పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై మంగళవారం (సెప్టెంబర్ 8) మండలిలో మహేష్ కుమార్ రియాక్ట్ అయ్యారు.స్పీకర్‌ను అవమానించడం తాతా మధు ఆలోచన కాదని.. తాతా మధును కేసీఆర్ ఉసిగొల్పి అలా మాట్లాడించారని ఆరోపించారు. దళిత మహిళలను అవమానించిన పార్టీ బీఆర్ఎస్ అని.. బీఆర్ఎస్ దళిత, గిరిజనుల వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని చైర్మన్ ను కోరారు.

మిగతాద్ది 2 లో

తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారమున్నా అలా చేయలేదు: స్పీకర్

హైదరాబాద్:
అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం తనకుందని.. కానీ తాను అలా చేయలేదని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మీడియాతో స్పీకర్ చిట్‌చాట్ నిర్వహించారు.

2 లో

పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

- సెప్టెంబర్ 16 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం
- మొత్తం 7,437 పోలీసు ఉద్యోగాల భర్తీ
- గత గడువు సెప్టెంబర్ 9
- ఇప్పటివరకు 3,38,336 మంది రిజిస్ట్రేషన్
- 2,88,530 మంది ఫీజు చెల్లింపు
- ఆధార్ వెరిఫికేషన్ 95%కిపైగా పూర్తి
- చివరి నిమిషంలో దరఖాస్తు చేయొద్దని సూచన

2లో..

ఆన్‌లైన్‌లో గణేశ్ మండపాల నమోదు తప్పనిసరి: సీపీ సజ్జనార్

హైదరాబాద్:
నగరంలో గణేశ్ మండపాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా.. గణేశ్ మండపాల వివరాలను ఉత్సవ నిర్వాహకులు ముందస్తుగానే policeportal.tspolice.gov.in/index.htmలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ముందుగా సమాచారం ఇస్తే ఆయా ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లకు, నిమజ్జనం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసు యంత్రాంగానికి సులువవుతుందన్నారు.

2 లో

తెలంగాణ పోలీస్ శాఖలో బదిలీలు.. కొత్త పోస్టింగ్‌లు

హైదరాబాద్:
తెలంగాణ పోలీస్ శాఖలో 17 మంది డీఎస్పీ స్థాయి అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు కల్పిస్తూ డీజీపీ సి.వి.ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సిఫారసుల మేరకు ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీ అయిన అధికారులను వెంటనే రిలీవ్ చేసి, వారికి కేటాయించిన కొత్త స్థానాల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత యూనిట్ అధికారులను డీజీపీ ఆదేశించారు.

అధికారులు ఎవరెవరు.. ఎక్కడికి బదిలీ అయ్యారంటే..?

1. కె. బాలకృష్ణారెడ్డి -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను మల్కాజిగిరి సైబర్ క్రైమ్స్ ఏసీపీగా నియమించారు.
2. ఎస్.జి. శివశంకర్ -- ప్రస్తుతం మల్కాజిగిరి సైబర్ క్రైమ్స్ ఏసీపీగా ఉన్న ఆయనను బదిలీ చేసి హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

సరూర్‌నగర్‌లో గజం రూ.1,64,000

- సరూర్‌నగర్‌లో భూమికి భారీ డిమాండ్
- 4,356 చదరపు గజాల స్థలానికి హెచ్‌ఎండీఏ వేలం
- కనీస ధర రూ.1.50 లక్షలుగా నిర్ణయం
- వేలంతో రూ.71.44 కోట్ల ఆదాయం
- ఎల్‌బీనగర్, దిల్‌సుఖ్‌నగర్‌కు సమీపంలో స్థలం
- వ్యాపార వర్గాల నుంచి అనూహ్య స్పందన
- హైదరాబాద్‌లో భూముల డిమాండ్‌కు నిదర్శనం

హైదరాబాద్:
సరూర్‌నగర్‌లోని 4,356 చదరపు గజాల స్థలానికి సోమవారం హెచ్‌ఎండీఏ బిడ్డింగ్ నిర్వహించింది. గజానికి రూ.1,50,000 కనీస ధర నిర్ణయించగా, అత్యధికంగా రూ.1,64,000 నమోదైంది. వేలం ద్వారా రూ.71.44 కోట్ల ఆదాయం సమకూరింది. వేలం వేసిన భూమి.. సరూర్‌నగర్‌లోని ఎల్‌బీ నగర్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాలకు దగ్గరగా ఉండడంతో వ్యాపార వర్గాల నుంచి అనూహ్యమైన స్పందన లభించినట్లు అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో భూములకు ఉన్న డిమాండ్‌ను ఈ ధర ప్రతిబింబించిందని తెలిపారు.

ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్:
శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు.

కేటీఆర్, హరీశ్‌రావు విడుదల

- రేవంత్ సర్కార్‌పై తీవ్ర ఆగ్రహం
- కాంగ్రెస్‌ది దమనకాండ.. డైవర్షన్ పాలిటిక్స్: హరీశ్‌రావు
- హెడ్‌లైన్స్ మారుతాయి.. ప్రజల జీవితాలు మారవు: హరీశ్‌రావు
- మహిళా ఎమ్మెల్యేలపై దాడిని ఖండించిన కేటీఆర్
- 600కు పైగా హామీలిచ్చి.. వెయ్యి రోజులైనా నెరవేర్చలేదు: కేటీఆర్
- కేసీఆర్ ఇంటి ముట్టడి నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల అరెస్టులు
- బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ల నుంచి విడుదల
- రాష్ట్రంలో ఉద్రిక్తతలపై బీఆర్ఎస్ నేతల తీవ్ర విమర్శలు

హైదరాబాద్:
కాంగ్రెస్ గుండాలను కేసీఆర్ ఇంటి మీదకు పంపారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బోయిన్‌పల్లి పీఎస్ నుంచి విడుదలైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళా ఎమ్మెల్యేల మీద హేయంగా దాడి చేశారని అందరి కంటే ముందు చావు వచ్చేది కాంగ్రెస్ పార్టీకేనని 600కు పైగా హామీలిచ్చి వెయ్యిరోజులైనా ఇంకా వాటిని నేరవేర్చలేదని..స్కూటీలు ఇస్తానని లూటీలు చేశారని రేవంత్ సర్కారుపై ధ్వజమెత్తారు. దశాబ్దాల తెలంగాణ కలను కేసీఆర్ నెరవేర్చారని ప్రపంచ పటంలో హైదరాబాద్‌ను విశ్వనగరంగా నిలబెట్టారని కొనియాడారు.అనంతరం జవహర్ నగర్ పీఎస్ నుంచి విడుదలైన అనంతరం హరీష్ రావు మాట్లాడారు.

మిగతాద్ది 2 లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం సెప్టెంబర్ 09, 2026

‘బతుకమ్మ ఛాలెంజ్‌ను సద్వినియోగం చేసుకోండి’

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ. దీనిని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ‘బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026’ను యువ ఫిలిం మేకర్స్ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుందరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్‌రెడ్డితో కలిసి మంత్రి ఛాలెంజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

విజయవంతం చేయాలని..

మంత్రి మాట్లాడుతూ.. షార్ట్‌ఫిలింలు, పాటలు, వీడియోల ద్వారా యువత తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ ఛాలెంజ్ చక్కటి వేదికగా నిలుస్తుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. యువ ఫిలిం మేకర్స్, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ‘బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026’ను విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారమున్నా అలా చేయలేదు: స్పీకర్

మొదటిపేజీ తరువాయి

“శాసనసభలో సభ్యుడు కాకపోయినా తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం నాకుంది. బీఆర్ఎస్‌లాగా వెంటనే బహిష్కరించలేను. ఏదైనా ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నాం. మహిళా సభ్యులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. రాహుల్ గాంధీ నల్ల టీషర్ట్ వేసుకుని వెళ్లారు కానీ.. అదానీ ఫొటో పెట్టుకోలేదు. తాతా మధు వ్యవహారంలో కేసీఆర్ వచ్చి క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. సమావేశాలకు హాజరుకావాలని ప్రతి సెషన్ ముందు ఆయన్ను కోరుతూనే ఉన్నాను. ఇవాళ నేను సభ నడపలేనని చెప్పాను. ప్యానల్ స్పీకర్‌గా కడియం శ్రీహరి సభను నడిపిస్తారు” అని గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు.

పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

మొదటిపేజీ తరువాయి

పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించింది. సెప్టెంబర్ 16 సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించినట్లు పోలీసు నియామక మండలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (TSLPRB) 7,437 పోస్టుల భర్తీకి జులై 29న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్ సివిల్(3,697) ఏఆర్(1,052), పోలీస్ కానిస్టేబుల్ (ఎస్ఏఆర్ పీపీఎల్ మెన్) 24, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్(1,380), ఫైర్ ఫైటర్(751), జైలు వార్డర్(208) పోస్టులున్నాయి. దరఖాస్తు చివరి తేదీ సెప్టెంబర్ 9గా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ గడువును సెప్టెంబరు 16 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకోగా.. 2,88,530 మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లినట్టు టీఎస్ఎల్ఆర్‌బీ తెలిపింది. అభ్యర్థుల ఆధార్ వెరిఫికేషన్ కూడా 95 శాతానికి పైగా పూర్తయిందని పేర్కొంది. చివరి నిమిషంలో దరఖాస్తు చేస్తే సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని, అభ్యర్థులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సూచించింది.

బీఆర్ఎస్‌కు పార్టీగా కొనసాగే అర్హత లేదు: మహేష్ గౌడ్

మొదటిపేజీ తరువాయి

వివాదం ఏంటంటే..?

సోమవారం (సెప్టెంబర్ 7) తెలంగాణ వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ 1000 రోజుల పాలన ఫెయిల్ అని ప్రింట్ చేసి ఉన్న బ్లాక్ టీ షర్ట్స్తో ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి వచ్చారు. దీంతో అసెంబ్లీ గేట్ దగ్గర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు.

బ్లాక్ టీ షర్టులతో లోపలికి అనుమతించలేదు. తమను ఎందుకు ఆపుతున్నారంటూ పోలీసులతో బీఆర్ఎస్ సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తీవ్ర ఆగ్రహానికి గురై ‘ఎవడ్రా స్పీకర్.. ఎవడ్రా మీకు అధికారం ఇచ్చింది’ అంటూ స్పీకర్ను ఏకవచనంతో సంబోధించాడని కాంగ్రెస్ ఆరోపించింది. ూశీశ్రీఱఅఎం

రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవికి కనీస మర్యాద ఇవ్వకుండా బీఆర్ఎస్ నేత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్ స్థానంలో ఉండటం నచ్చకే బీఆర్ఎస్ నేతలు ఇలా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వ్యాఖ్యలను శాసన సభలో సీఎం, మంత్రులు, కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీని తక్షణమే డిస్మిస్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

మొదటిపేజీ తరువాయి

దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్.. సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది.
అంతకుముందు శాసనసభ కూడా తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. మంత్రి దామోదర రాజనర్సింహ ఈ మేరకు సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. “స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోంది. సభామర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోంది. మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోంది. బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలి. శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి. నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి” అని శాసనసభ తీర్మానించింది.

యూకే ఏటీసీలో సమస్య.. 300 విమానాలు రద్దు!

యూకేలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతిక సమస్య తలెత్తింది. లండన్‌లోని హీత్రూ, స్టాన్‌స్టెడ్ విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించే అనేక సర్వీసులు రద్దయ్యాయి. దీంతో పాటు మాంచెస్టర్, బర్మింగ్‌హామ్ తదితర నగరాల్లోని ఎయిర్‌పోర్ట్‌లపై తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్‌రాడార్24 పేర్కొన్న వివరాల ప్రకారం.. ఇప్పటివరకు దాదాపు 300 విమానాలు రద్దయినట్లు సమాచారం. సమస్యను పరిష్కరించేందుకు ఇంజినీర్లు ప్రయత్నిస్తున్నారని, సేవల పునరుద్ధరణకు కొంత సమయం పడుతుందని బ్రిటన్ ‘నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్’ తెలిపింది. ఈ ప్రభావం బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఈజీజెట్, కెఎల్ఎం, లుఫ్తాన్సా సహా అనేక విమానయాన సంస్థల సర్వీసులపై పడినట్లు ఫ్లైట్‌రాడార్ పేర్కొంది. సంబంధిత ఎయిర్‌లైన్స్ అప్‌డేట్‌లకు అనుగుణంగా ప్రయాణికులు నడుచుకోవాలని సూచించింది.

కేటీఆర్, హరీశ్‌రావు విడుదల

మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. రేవంత్ చేసే దమనకాండను రాష్ట్ర ప్రజలంగా గమనిస్తున్నారన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో హెడ్ లైన్స్ మారుతాయి కానీ ప్రజల జీవితాలు మారవని చెప్పారు. హరీష్ రావు మాట్లాడుతూ..”తెలంగాణలో క్రాప్ హాలిడే ప్రకటించారు. యూరియా యాప్‌లు పెట్టి రైతుల ఉసురు పోసుకుంటున్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు ధర్నా చేస్తున్నారు. ఉద్యోగుల ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదు. నయాపైసా ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వడం లేదు. సబితక్క గొంతు మీద మగ పోలీసు చేయి వేసి నొక్కారు అసెంబ్లీ గౌరవ సభను రేవంత్ కౌరవసభగా మార్చారు.” అన్నారు. కాగా ఈ రోజు రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్తితులు ఏర్పడ్డాయి.

ఏం జరిగింది?

కేసీఆర్ ఇంటి ముట్టడికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన పిలుపుతో యాదాద్రిలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కేసీఆర్ ఇంటిని ముట్టడించేందుకు వెళుతున్న కాంగ్రెస్ నేతల్ని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్ళు రువ్వుకున్నారు. కేసీఆర్ ఎర్రవెల్లి నివాసం ముట్టడికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెళ్తున్నారనే సమాచారంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అప్రమత్తమయ్యారు. అసెంబ్లీ నుంచి ఎర్రవల్లికి బయల్దేరారు.
ఈ క్రమంలో కేసీఆర్‌కు మద్దతుగా వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బొల్లారం వద్ద భారీ ఎత్తున మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. బొల్లారం చౌరస్తా నుండి ఎరవెల్లి వైపు రోడ్డుపై కేటీఆర్ హరీష్ రావు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నడుచుకుంటూ వెళ్లారు. హకీంపేట్ దాటిన తర్వాత కేటీఆర్, హరీష్ రావుతో పాటు ఇతర పార్టీ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేటీఆర్‌ని బోయన్ పల్లి, హరీష్ రావును జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ తరలించారు. కాసేపటి క్రితమే వారిద్దరిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో వారిద్దరు మీడియా ఎదుట మాట్లాడారు.

తెలంగాణ పోలీస్ శాఖలో బదిలీలు.. కొత్త పోస్టింగ్‌లు

మొదటిపేజీ తరువాయి

3. ఎస్‌కే అబ్దుల్ రహ్మాన్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు జయశంకర్ భూపాలపల్లి డీసీఆర్‌బీ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.
4. ఏ. రవికుమార్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను జగిత్యాల డీసీఆర్‌బీ డీఎస్పీగా నియమించారు.
5. బి. నందిరామ్ నాయక్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలోని డీజీ కంట్రోల్ రూమ్ డీఎస్పీగా బాధ్యతలు అప్పగించారు.
6. బి. సోమ్నారాయణ్ సింగ్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ) డీఎస్పీగా నియమించారు.
7. జె. వెంకటేశ్వర్‌రావు -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు మెదక్ డీసీఆర్‌బీ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.
8. బి. కిషన్‌కుమార్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను హైదరాబాద్ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసీపీగా నియమించారు.
9. ఎల్. రమేష్‌కుమార్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు హైదరాబాద్ సిటీ సీటీసీ ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారు.
10. ఎన్. శ్రీనివాస్‌రెడ్డి -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను సంగారెడ్డి డీసీఆర్‌బీ డీఎస్పీగా నియమించారు.
11. కాదేరు వెంకట్‌రెడ్డి -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ) డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.
12. కొమల్ల సుబ్బరామిరెడ్డి -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను హైదరాబాద్ సిటీ సీసీఎస్ అండ్ డీడీ ఏసీపీగా నియమించారు.
13. ఎస్. సుదర్శన్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు హైదరాబాద్ సిటీ సీసీఎస్ అండ్ డీడీ ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారు.
14. ఎస్. శంకర్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనను హైదరాబాద్ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఏసీపీగా నియమించారు.
15. పి. విజయ్‌కుమార్ -- వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు వెస్ట్‌జోన్ రోడ్ సేఫ్టీ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.
16. కె. భాస్కర్ -- ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల డీసీఆర్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయనను బదిలీ చేసి తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ) డీఎస్పీగా నియమించారు.
17. ఎం. వెంకట నర్సయ్య -- ప్రస్తుతం ఆదిలాబాద్ డీసీఆర్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయనను బదిలీ చేసి సీఐడీ డీఎస్పీగా నియమించారు.

మోదీ హాజరయ్యే సదస్సు.. PMO ఫేక్ ఐడీ, తుపాకీ కలకలం!

ముంబయిలో ప్రధాని మోదీ పాల్గొనాల్సిన ఓ కార్యక్రమంలో భద్రతా సమస్య ఎదురైంది. కొన్ని గంటల ముందే సభా ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. అనుమానితుడి వద్ద ప్రధానమంత్రి కార్యాలయం పేరుతో ఫేక్ ఐడీ కార్డు, అతడి బాడీగార్డ్‌గా పేర్కొన్న మరో వ్యక్తి వద్ద తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. విషయం తీవ్రత దృష్ట్యా.. ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈ కేసు దర్యాప్తు బాధ్యతను చేపట్టారు. ప్రస్తుతం ఆ ఇద్దరినీ విచారిస్తున్నారు.

ముంబయిలోని బాంద్రా- కుర్లా కాంప్లెక్స్‌లోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ కార్యక్రమం జరగనుంది. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును ప్రధాని మోదీ మంగళవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో వేదిక సమీపంలో తనిఖీలు చేస్తున్న పోలీసులకు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ప్రశ్నించగా.. రోహన్ పరేఖ్ (24) అనే వ్యక్తి వద్ద ప్రధానమంత్రి కార్యాలయం పేరుతో ఫేక్ ఐడీ కార్డు, అతడి గన్‌మెన్ వద్ద తుపాకీ లభించింది. అప్రమత్తమైన అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని వారిద్దర్నీ అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల కోసం 5 లక్షల సిమ్‌కార్డులు

విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైని అన్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు అనుగుణంగా వారంతా నైపుణ్యాలు నేర్చుకోవాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం 5లక్షల సిమ్ కార్డుల కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఈ మేరకు ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ-లెర్నింగ్‌లో భాగంగా ఈ ఏడాది 10

నుంచి 12 తరగతి చదివే విద్యార్థుల్లో 5లక్షల మందికి ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వీటికి ఇంటర్నెట్ సదుపాయం కల్పించేందుకు సిమ్ కార్డులు కొనుగోలు చేయాలని తాజాగా నిర్ణయించింది. తద్వారా విద్యార్థులు ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్‌తోపాటు ఇతర విద్యా సంబంధిత సోర్సుల నుంచి కొత్త నైపుణ్యాలను నేర్చుకునే వీలుంటుందని హరియాణా ప్రభుత్వం భావిస్తోంది.

మైనర్ బాలికపై అత్యాచారం.. నిందితుడికి మరణశిక్ష

తమిళనాడులోని తిరునెల్వేలిలో ఓ మైనర్ బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నాలుగేళ్ల క్రితం జరిగిన ఈ ఘటన లో ఒక నిందితుడికి న్యాయస్థానం మరణశిక్ష విధించింది. మరో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. తిరునెల్వేలికి చెందిన 16 ఏళ్ల బాధితురాలికి 2022లో పెయింటర్‌గా పనిచేసే మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. రెండు వారాల పాటు వీరిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ

బాలికను అతడు మీనాక్షిపురంలోని తన బంధువుల ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ తన స్నేహితులు చిన్నకుట్టి, మురుగేశన్‌తో కలిసి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు.

గర్భస్రావం వికటించి బాలిక మృతి

ఈ విషయాన్ని బాధితురాలు తన కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో (గూజూూ) చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. దీనిపై విచారణ జరిపిన ప్రత్యేక న్యాయస్థానం.. మంగళవారం తీర్పు వెలువరించింది. గతంలో తీవ్ర నేర చరిత్ర ఉన్న చిన్నకుట్టికి మరణశిక్ష విధించిన కోర్టు.. మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది.

మొజ్తబాకు విదేశాల్లో ఆస్తులున్నాయా ఇరాన్ ఏమందంటే..!

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కి విదేశాల్లో ఆస్తులు ఉన్నట్లుగా పలు అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాలపై ఆ దేశం స్పందించింది. తమ సుప్రీం లీడర్‌పై వస్తున్న ఈ వార్తలను తోసిపుచ్చింది. ఈ మేరకు స్పందించిన భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం.. అవన్నీ తప్పుడు వార్తలేనని, ఆ ప్రచారాలకు ఎటువంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది.
‘మా మాజీ సుప్రీం అయతుల్లా ఖమేనీ మాదిరిగానే ప్రస్తుత సుప్రీం మొజ్తబా కి కూడా ఇరాన్ వెలుపల గానీ, విదేశాల్లో

గానీ ఎటువంటి ఆస్తులు లేవు. ఆయన నిరాడంబరమైన జీవితం గురించి ఇరాన్ ప్రజలకు బాగా తెలుసు. మొజ్తబాపై ఉన్న ప్రేమ, గౌరవంతోనే దేశ ప్రజలు ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. ఆయనపై తప్పుడు ప్రచారం చేయాలనే ఉద్దేశంతో కావాలనే కొందరు ఇలాంటి కథలు అల్లుతున్నారు. వీటిలో ఎంతమాత్రమూ నిజం లేదు’ అని ఇరాన్ రాయబార కార్యాలయం పేర్కొంది.

తీవ్రరూపం దాల్చిన సౌదీ అరేబియా-హూతీల పోరు

లండన్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయానికి ఎదురుగా మొజ్తబా ఖమేనీకి రెండు లగ్జరీ ఫ్లాట్లు ఉన్నాయంటూ ఇటీవల పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు రాశాయి. 2014, 2016లో వివిధ మధ్యవర్తుల ద్వారా వాటిని కొనుగోలు చేసినట్లుగా పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ ఆస్తులను ఆయన విక్రయానికి పెట్టినట్లుగా వచ్చిన వార్తా కథనాలను భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కొట్టిపారేసింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం సెప్టెంబర్ 09, 2026

భారతదేశంలో కులాంతర వివాహాలు

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

- **ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ పరిశోధన**
- **కులాంతర వివాహాల వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక కారణాలు.**

కులాంతర వివాహాల పెరుగుదల

మన దేశంలో 1970 నుండి 2011 వరకు కులాంతర వివాహాల రేటు కేవలం 5% నుండి 5.8% మధ్యే ఉండేది.
అయితే, ఇటీవల జరిగిన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (NFHS) ప్రకారం ఈ రేటు క్రమంగా పెరిగి 12.6%నికి చేరుకుంది.
మతాంతర వివాహాలు: కులాంతర వివాహాలతో పోలిస్తే మతాంతర వివాహాల్లో పెద్దగా మార్పు రాలేదు. ఇవి కేవలం 2.1% నుండి 2.6% కి మాత్రమే పరిమితమయ్యాయి.

రాష్ట్రాల వారీగా గణాంకాలు వ్యత్యాసాలు

▪ ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువ

భారతదేశంలోనే అత్యధికంగా ఈశాన్య రాష్ట్రాల్లో కులాంతర వివాహాలు జరుగుతున్నాయి.
ముఖ్యంగా
మిజోరంలో 55%, మేఘాలయలో 46%, మరియు సిక్కింలో 38% వివాహాలు కులాలకు అతీతంగా జరుగుతున్నాయి.

▪ ఇతర రాష్ట్రాల్లో తక్కువ

దీనికి భిన్నంగా మధ్యప్రదేశ్ లో కేవలం 1% మాత్రమే కులాంతర వివాహాలు జరుగుతున్నాయి అంటే 99% పెళ్లిళ్లు సొంత కులంలోనే జరుగుతున్నాయి.

అలాగే ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్‌లలో 98% వివాహాలు స్వకులంలోనే జరుగుతున్నాయి.

వివిధ వర్గాల డేటా

ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ పరిశోధన ప్రకారం వివిధ వర్గాల్లో కులాంతర వివాహాల శాతం ఇలా ఉంది:

- బ్రాహ్మణులు: **6.3%.**
- ఇతర అగ్రవర్ణాలు: **6.2%.**
- ఓబీసీలు (OBC): **4.8%.**
- ఎస్సీలు (SC): **4.7%.**

బ్రాహ్మణుల 6.3% కులాంతర వివాహాల వెనుక అసలు నిజం

▪ 6.3% గా ఉన్న బ్రాహ్మణుల కులాంతర వివాహాల వెనుక మిస్టరీ ఉంది

సాంప్రదాయాలు ఎక్కువగా పాటించే బ్రాహ్మణులలో ఈ శాతం ఎక్కువగా ఉండటానికి కారణం సర్వేలో వాడిన "జాతి" అనే పదం. తెలుగులో మనం పిలిచే కులం అనే పదాన్ని హిందీలో జాతి అని అంటారు.

▪ **బ్రాహ్మణులలో అయ్యర్, అయ్యంగార్, కన్యాకుబ్జ, సారస్వత్, నంబూద్రి,** స్మార్తులు, మాధ్వులు, మరియు హవ్యక బ్రాహ్మణులు,చిత్పవన్, కొంకణస్థ, దేశస్థ,కర్హాడే, మైథిల,ఉత్కళ, గౌడ బ్రాహ్మణులు, వైదికులు,నియోగులు,శ్రీవైష్ణవులు...ఇలా బ్రాహ్మణులలో ఉన్న ఉప కులాలలో జరిగే పెళ్లిళ్లు అన్నీ కూడా కులాంతర వివాహంగా గణాంకాలు చూపించాయి.విశ్లేతా బ్రాహ్మణులే ..

కానీ కులం అనే వర్గం కింద ఈ ఉప కులాలను ఇతర కులాలుగా ప్రభుత్వం పరిగణించిన కారణంగా వీళ్ళ వివాహాలన్నీ కులాంతర వివాహాల కింద పరిగణించబడ్డాయి.

సర్వేలో ఒక ఉపకులానికి చెందిన వ్యక్తి మరో ఉపకులం వ్యక్తిని పెళ్లి చేసుకున్నప్పుడు వారు "వేర్వేరు" అని చెప్పడం వల్ల అది కులాంతర వివాహంగా రికార్డ్ అయింది.

▪ **కాబట్టి బ్రాహ్మణులలో ఒకే విధమైన సామాజిక, ఆర్థిక హోదా కలిగిన దగ్గరి ఉపకులాల మధ్య జరిగిన సర్దుబాటు మాత్రమే తప్ప, సామాజిక అంతరాలను తుడిచేసే విప్లవం కాదు.**

వివాహాలపై ప్రభావం చూపే కీలక అంశాలు

▪ **సాధారణంగా ధనవంతులయ్యే కొద్దీ కుల వ్యవస్థ బలహీనపడుతుందని అనుకుంటారు, కానీ ఇక్కడ డేటా రివర్స్‌గా ఉంది.**

అత్యంత పేద వర్గాలలో కులాంతర వివాహాలు 5.89% ఉంటే...
సంపన్న వర్గాలలో అది కేవలం 4.01% మాత్రమే ఉంది.

ధనిక వర్గాలు తమ ఆస్తులు, బిజినెస్ లు, సోషల్ స్టేటస్ బయటివారికి వెళ్లకుండా చూసుకోవడానికి సొంత కులంలోనే .. కొన్నిసార్లు సొంత కుటుంబాల్లోనే పెళ్లిళ్లకు ప్రాధాన్యత ఇస్తారు.

▪ పట్టణీకరణ

నగరాల కంటే గ్రామాల్లోనే కులాంతర వివాహాల శాతం కొద్దిగా ఎక్కువగా ఉండటం విశేషం. **గ్రామాల్లో 5.24%, నగరాల్లో 4.99% ఉంది.**

అయితే నగరాల్లో పెరిగిన ఉన్నత చదువులు, ఆర్థిక స్వాతంత్ర్యం వల్ల ఒకే రకమైన సోషియో-ఎకనామిక్ స్టేటస్ ఉన్న జంటల మధ్య కులాంతర వివాహాలు పెరుగుతున్నాయి.

▪ మహిళా విద్య

సర్వే ప్రకారం ఒక కుటుంబంలో అబ్బాయి తల్లి విద్యాస్థాయి 10 ఏళ్ల పెరిగితే .. అంటే టెన్త్ క్లాస్ లేదా అంతకంటే ఎక్కువ చదివితే, ఆ ఇంట్లో కులాంతర వివాహం జరిగే అవకాశం 76% పెరుగుతుంది.

▪ **సమాజంలో నిజమైన మార్పు మహిళా విద్య మరియు ఆర్థిక స్వావలంబన ద్వారానే వేగవంతం అవుతుంది.**

భారతదేశం ఆధునీకరణ వైపు వెళ్తున్నప్పటికీ, నేటికీ 73% వివాహాలు పెద్దలు కుదిర్చినవే (Arranged marriages) జరుగుతున్నాయి.

కుల సరిహద్దులు దాటి ప్రేమ వివాహాలు చేసుకున్నప్పుడు పరువు హత్యలు, సామాజిక బహిష్కరణలు వంటి కఠిన వాస్తవాలు ఇంకా ఎదురవుతూనే ఉన్నాయి.

కేవలం పైపై హెడ్‌లైన్స్ చూసి సమాజం మారిపోయిందనుకోవడం కంటే, క్షేత్రస్థాయిలో జరుగుతున్న నెమ్మదైన సామాజిక, ఆర్థిక మార్పులను గమనించడం ముఖ్యం.

భారతదేశంలో ఈ కులం కుంపటి రాజేసింది బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ.

కలకత్తా లోని ఫోర్ట్ విలియం సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన సర్ విలియం జోన్స్ 1794 లో ఊరు పేరు లేని ఎవరో రాసిన మనుస్మృతిని ఇంగ్లీషులోకి అనువదించాడు.

భారతీయత అంటే ఏమిటో తెలియని ఈ బ్రిటిష్ అధికారి వర్ణ వ్యవస్థను కుల వ్యవస్థగా చిత్రించి సమాజంలో విభజనకు బీజం వేశారు.

ఆంగ్లేయులు భారతదేశంలో పాలన కొరకు మతాల పర్సనల్ లా పొందిస్తున్న సమయంలో ముస్లింలకు ఖురాన్ షరియా, క్రైస్తవులకు బైబిల్ కానన్ లా జుఆశీశ ఇంపు ఉన్నట్టే హిందువులకు కూడా ఏదో ఒక మత గ్రంథం ఉంటుందని భావించారు.

వాస్తవంగా హిందువులకు ఒక మత గ్రంథం అంటూ ఏదీ లేదు. పర్సనల్ లా అంటూ ఏమీ లేదు.

▪ **కానీ, భారత దేశ జీవన విధానం, దేశ ఔన్నత్యం తెలియని బ్రిటిష్ వారు మనుస్మృతిని భారతీయుల పౌర స్మృతిగా భావించారు.**

భారతదేశంలో రూపొందిన న్యాయ వ్యవస్థ లో, పాలనా విధానాల్లో ప్రవేశపెట్టిన ఈ కుల విభజన, కుల భూతం భారతదేశాన్ని పట్టిపీడిస్తున్నది.

ఈ కులాంతర వివాహాలను అందరూ ప్రోత్సహించాలి. మన భారతీయ సమాజంలో ఉన్న ఈ కుల భూతం నశించాలి.

భారత్ మాతాకీ జై

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో సంగేపు అనిరా ఆలివ్స్‌కు స్వర్ణం

- టైకా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్--2026లో మెరిసిన ఏడేళ్ల బాలిక

కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబర్ 8

టైకా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సెప్టెంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించిన 'టైకా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్--2026' పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ పోటీల్లో భాగంగా ఆదివారం (సెప్టెంబర్ 6న) నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఏడేళ్ల బాలిక సంగేపు అనిరా ఆలివ్స్ అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని (గోల్డ్ మెడల్) కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో అనిరా తనదైన ప్రత్యేక శైలి, నైపుణ్యంతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి ప్రథమ స్థానంలో నిలిచింది. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లోనూ అనిరా ఆలివ్స్ రెండు పతకాలు గెలుచుకుని తన సత్తా చాటింది. ఇంత చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో రెండు పతకాలు, తాజాగా రాష్ట్ర స్థాయిలో స్వర్ణం సాధించి వరుస విజయాలతో దూసుకుపోతుండటం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కోచ్ కిరణ్ మాట్లాడుతూ.. అనిరా ఆలివ్స్ చూపే క్రమశిక్షణ, క్రీడ పట్ల ఆమెకున్న అంకితభావమే ఈ విజయానికి కారణమని కొనియాడారు. ప్రత్యేక శిక్షణ ద్వారా ఆమె తన నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుందని, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి మరిన్ని పతకాలు సాధిస్తుందని తనకు పూర్తి నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా పలువురు కరాటే క్రీడాకారులు పాల్గొన్న ఈ జాతీయ స్థాయి పోటీల ముగింపు కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, సినీ నటుడు, 8వ డాన్ బ్లాక్ బెల్ట్ డా. సుమన్ తల్వార్, టైకా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు శిహాన్ గ్రాండ్ మాస్టర్ డా. పి. అశోక్ చక్రవర్తి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలను అభినందించారు. స్వర్ణ పతకం సాధించిన అనిరా ఆలివ్స్‌ను అతిథులతో పాటు పలువురు క్రీడా ప్రముఖులు, కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

పోషకాహారంతో ఆరోగ్యం
అవయవదానంతో ప్రాణదానం!

- విశ్రాంత డి ఎఫ్ ఓ పురుషోత్తం

పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (స్వయంప్రతిపత్తి) హనుమకొండలో నిర్వహించిన జాతీయ పోషకాహార వారోత్సవాల ముగింపు కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్ట్ నెంట్ ప్రొఫెసర్ బి చంద్రమౌళి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అతిథులుగా సదాశయ ఫౌండేషన్ సభ్యులు విశ్రాంత డీఎఫ్ఓ పురుషోత్తం మాట్లాడుతూ.. పోషకాహారంతో ఆరోగ్యం అవయవదానంతో ప్రాణదానం చేయవచ్చని అన్నారు.ఫైల్ అధ్యాపకుడు శ్రీనివాస్ , విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వలపతి మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన జీవితానికి పోషకాహారం అత్యంత అవసరమని తెలిపారు. సరైన ఆహారపు అలవాట్ల ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. అలాగే అవయవ దానం ప్రాధాన్యతను వివరిస్తూ, అవయవదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, అప్లైడ్ న్యూట్రిషన్ విభాగాధిపతి డా. జె. లకన్ సింగ్ మాట్లాడుతూ, జాతీయ పోషకాహార వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు విద్యార్థినుల్లో ఆరోగ్యం, పోషకాహారంపై విస్తృత అవగాహన కల్పించాయని తెలిపారు.

దళిత, ఆదివాసీల హక్కుల కోసం పార్లమెంట్‌లోనూ.. ప్రజల్లోనూ పోరాటం

» బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల పట్ల సవతి తల్లి వైఖరి అవలంబిస్తోంది: వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య
» ఎస్సీ, ఎస్టీ ఎంపీల సమావేశంలో కీలక నిర్ణయాలు
» హల్ద్వానీ 'శుద్ధీకరణ' ఘటనను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ ఎంపీలు
» రాష్ట్రపతికి సంయుక్త వినతిపత్రం అంద జేయాలని నిర్ణయం

కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8

దళితులు, ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పార్లమెంట్‌లోనూ, ప్రజల మధ్యనూ సమష్టిగా పోరాటం కొనసాగించాలని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు నిర్ణయించినట్లు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య తెలిపారు. న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ ఎంపీల సమావేశంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా. కడియం కావ్య మాట్లాడుతూ.. కేంద్రంలో ని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. దళితులు, ఆదివాసీలపై దాడులు పెరుగుతున్నప్పటికీ వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, వారి సంక్షేమానికి కేటాయించే నిధులను కూడా తగ్గించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల పట్ల కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు.
కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలను పార్లమెంట్‌లో బలంగా ప్రస్తావించడంతో పాటు అవసరమైతే ప్రజల మధ్యకు వెళ్లి ఉద్యమాలు చేపడతామని ఎంపీ స్పష్టం చేశారు.

హల్ద్వానీ ఘటనపై తీవ్ర నిరసన

మల్లికార్జున ఖర్గే ఉత్తరాఖండ్ పర్యటన అనంతరం హల్ద్వానీలో చోటుచేసుకున్నట్లు వెల్లడైన 'శుద్ధీకరణ' ఘటనను సమావేశం తీవ్రంగా ఖండించినట్లు డా. కడియం కావ్య తెలిపారు. ఈ ఘటన దళితుల ఆత్మగౌరవానికే కాకుండా సమానత్వం, గౌరవం, అంటరానితనం నిర్మూలన వంటి భారత రాజ్యాంగ విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.ఘటనకు బాధ్యులపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ను కలిసి సంయుక్త వినతిపత్రం సమర్పించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, గౌరవం, రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాటాన్ని కొనసాగించాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పిలుపు నిచ్చారు.

మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారాన్ని ఖండించిన బీఆర్ఎస్

- హుస్నాబాద్‌లో భారీ ధర్నా, నిరసన ర్యాలీ..
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ విమర్శలు

కరపత్రం ప్రతినిధి హుస్నాబాద్, సెప్టెంబర్ 8

తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ.. హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా, నిరసన ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నా అనంతరం పట్టణ ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రస్తుత, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ముఖ్యంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అభ్యంతరకరమని పేర్కొన్నారు. మహిళా ప్రజాప్రతినిధులను సైతం గౌరవించకుండా వ్యవహరించడం విచారకరమని అన్నారు. మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ద్వారా అనుచితంగా వ్యవహరించడం విరుద్ధమైన వైఖరికి నిదర్శనమని సతీష్ కుమార్ ఆరోపించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన మహిళా ప్రజా ప్రతినిధులకే గౌరవం, రక్షణ లేకపోతే సాధారణ మహిళలకు ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పిస్తుందనే సందేహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను ప్రజాస్వామ్యాన్ని, మహిళా గౌరవాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా కార్యక్రమాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతు సంక్షేమం, సాగునీరు, విద్యుత్, మహిళల సంక్షేమం, యువత ఉపాధి వంటి అంశాలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను దాచలేరని సతీష్ కుమార్ అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ధర్నా అనంతరం నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా స్వామ్య హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని నాయకులు తెలిపారు.

ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే భర్తరఫ్ చేయాలి: కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిర్జా అజీజుల్లా బేగ్

» దళిత గౌరవాన్ని అవమానిస్తే సహించం

» పశ్చిమ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి అంబేద్కర్ జంక్షన్ వద్ద ధర్నా, దిష్టిబొమ్మ దగ్ధం..

» సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

కరపత్రం ప్రతినిది హనుమకొండ, సెప్టెంబర్ 7

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే భర్తరఫ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, హనుమకొండ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు మిర్జా అజీజుల్లా బేగ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు అంబేద్కర్ జంక్షన్ వద్ద భారీ నిరసన చేపట్టాయి. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరూరి సాంబయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి ఆందోళన నిర్వహించారు. అనంతరం సుబేదారి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎమ్మెల్సీ తాతా మధుపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిర్జా అజీజుల్లా బేగ్, దళిత సామాజిక వర్గానికి చెందిన శాసనసభ స్పీకర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ వ్యవస్థకు తీవ్ర అవమానమని మండిపడ్డారు. ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు కుల, మత విభేదాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల వైఖరి దళితుల పట్ల వారి అసలు మనస్తత్వాన్ని బయటపెడుతోందని విమర్శించారు. గతంలో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన బీఆర్ఎస్ నాయకత్వం, ఇప్పుడు దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులు, బీసీలు, మైనార్టీలు ఐక్యంగా ఇటువంటి అవమానకర వ్యాఖ్యలను ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, తాతా మధును వెంటనే ఎమ్మెల్సీ పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, మేర సంఘం చైర్మన్ వెంకటరాజం, ఎనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక అనిల్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, లీగల్ సెల్ చైర్మన్ తోట రాజ్ కుమార్, ఐఎన్‌టీయూసీ నాయకుడు కూర వెంకట్, మీడియా సెల్ ఇన్‌చార్జ్ మార్క విజయ్, మాజీ కార్పొరేటర్లు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం: సూరారపు కృష్ణవేణి

▶ దళితుల పట్ల వివక్షపూరిత ధోరణి సమాజానికి మంచిది కాదు

▶ అసెంబ్లీ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కరపత్రం ప్రతినిది హైదరాబాద్, సెప్టెంబర్ 8

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలి రోజున సభ ఆవరణలో చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకురాలు సూరారపు కృష్ణవేణి పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కృష్ణవేణి మాట్లాడారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, అలాంటి వ్యాఖ్యలను తెలంగాణ రక్షణ సేన తీవ్రంగా ఖండిస్తోందని ఆమె అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ఎనిమిది దశాబ్దాలు గడిచినా దళితులు ఉన్నత పదవుల్లో ఉన్నప్పటికీ వారిపట్ల వివక్షపూరిత ధోరణి కొనసాగడం ఆందోళన కలిగించే విషయమని వ్యాఖ్యానించారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధిత నేతలు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఆవరణలో మహిళా ప్రజాప్రతినిధులతో పోలీసులు వ్యవహరించిన తీరుపైనా ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఉండాల్సిన శాసనసభ గౌరవాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు పరిరక్షించాల్సిన బాధ్యత ఉందని సూరారపు కృష్ణవేణి అన్నారు. రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తపరచాలని, శాసనసభ ఔన్నత్యాన్ని దెబ్బతీసే పరిణామాలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై వివక్ష పూర్తిగా తొలగాలంటే సామాజిక న్యాయ తెలంగాణ సాధన అవసరమని ఆమె పేర్కొన్నారు. ఆ లక్ష్య సాధన కోసం తమ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేన ఉద్యమాన్ని కొనసాగిస్తుందని తెలిపారుం

సెప్టెంబర్ 19, 20న ఎన్ఐటీ వరంగల్ 24వ స్నాతకోత్సవం

యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు పట్టాల ప్రదానం

▪ ప్రతిభావంతులకు బంగారు పతకాలు, ప్రత్యేక పురస్కారాలు

కరపత్రం ప్రతినిది హనుమకొండ, సెప్టెంబర్ 8

జాతీయ ప్రాముఖ్యత కలిగిన విద్యాసంస్థ జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (ఎన్ఐటీ) వరంగల్ 24వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 19, 20 తేదీల్లో ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్, డాక్టరల్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయడంతో పాటు, విద్యా, పరిశోధనా రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేక పురస్కారాలతో సత్కరించనున్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ స్నాతకోత్సవానికి టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెమీకండక్టర్, సాంకేతిక రంగాల్లో విశేష అనుభవం కలిగిన ఆయన ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి, పరిశ్రమల్లో నూతన అవకాశాల సృష్టికి చేసిన సేవలు విశేషంగా నిలిచాయి.ఎన్ఐటీ వరంగల్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి సమక్షంలో ఈ వేడుకలు నిర్వహించనున్నారు.ప్రఖ్యాత పారిశ్రామికవేత్త, సైయెంట్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశ్రమ--విద్యాసంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో విశేష కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.స్నాతకోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇన్‌స్టిట్యూట్ బంగారు పతకాలు, ఉత్తమ పీహెచ్‌డీ పరిశోధనా ప్రబంధం, ఉత్తమ ఎం.టెక్. డిసర్టేషన్, ఉత్తమ బీ.టెక్. ప్రాజెక్ట్ అవార్డులను ప్రదానం చేయనున్నారు.సెప్టెంబర్ 19న అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, సెప్టెంబర్ 20న పోస్ట్‌గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ విద్యార్థులకు పట్టాలను అందజేయనున్నారు.ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ, "ఎన్ఐటీ వరంగల్‌కు, మా విద్యార్థులందరికీ 24వ స్నాతకోత్సవం గర్వకారణమైన సందర్భం. సాంకేతిక, విద్యా రంగాలకు చెందిన ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమం జరగడం ఆనందదాయకం. ఈ వేడుక విద్యార్థుల వృత్తిపరమైన, పరిశోధనా జీవితాలకు నూతన అధ్యాయానికి నాంది పలుకుతుంది" అని తెలిపారు.

పర్యాటక రంగంలో ఆర్థిక, సామాజిక పరమైన సాంస్కృతికపరమైన అంశాలు

కరపత్రం ప్రతినిది బ్యూరో, సెప్టెంబర్ 8

ప్రభుత్వ పింగళి మహిళ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సర్టిఫికెట్ కోర్స్ లో భాగంగా ఈరోజు 8 -9- 2026 ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గా డాక్టర్ జి విజయ్ ప్రొఫెసర్ ఆఫ్ టూరిజం, డిపార్ట్మెంట్ ఆఫ్ టూరిజం చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ హైదరాబాద్ ఆహ్వానించడం జరిగింది. సస్టైనబిలిటీ టూరిజం సేఫ్టీ అండ్ ప్రాక్టికల్ ట్రైనింగ్ అనే అంశం పై సుదీర్ఘంగా ఉపన్యాసించారు. టూరిజంలో భాగంగా వివిధ ప్రాంతాలను సందర్శించినప్పుడు అక్కడ ఉన్న ప్రదేశాలను సందర్శించడమే కాకుండా అక్కడ సంస్కృతి ఆచారాలను గౌరవించడం అక్కడ ఉన్న ప్రజలతో మమేకం కావడం స్థానికంగా ఉండే సంస్కృతిలో భాగంగా పండగల్లో పాల్గొనడం జరుగుతుందని వివరించడం జరిగింది. హెరిటేజ్ టూరిజం భాగంగా వారసత్వ సంపదను కాపాడుకోవడం భావితరాలకు అందించే బాధ్యతను వివరించడం జరిగింది.కల్చరల్ టూరిజం లో భాగంగా వివిధ ప్రాంతాలలో సంస్కృతి విషయాలను వివరించడం జరిగింది. టూరిస్ట్ వివిధ ప్రాంతాలను సందర్శించినప్పుడు ఆ ప్రాంతాలకు ఆర్థిక అభివృద్ధి పరంగా ఎలా ఉంటుంది అని తెలియజేశారు అక్కడ ఉన్న ప్రజలకు ఆదాయం మార్గాలను ఎలా వస్తాయని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షతగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి చంద్రమౌళి వ్యవహరించడం జరిగింది. వైస్ ప్రిన్సిపల్ సుహాసిని మేడం, చరిత్ర విభాగం అధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ మరియు విభాగా అధ్యాపకులు డాక్టర్ పి నరేష్ జ్యోతి మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

భాగ్యవతి యాదవ్ మరణం తీరని లోటు: జక్కుల ప్రభాకర్ యాదవ్

నేడు నారాయణగూడ వెంకటేశ్వర కమ్యూనిటీ హాల్‌లో సంతాప సభ

కరపత్రం ప్రతినిది నారాయణగూడ, సెప్టెంబర్ 8

ప్రముఖ సంఘ సేవకురాలు జక్కుల భాగ్యవతి యాదవ్ అకాల మరణం సమాజానికి తీరని లోటని జక్కుల ప్రభాకర్ యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా గోల్కొండ జిల్లా మీడియా జాయింట్ కన్వీనర్ జక్కుల మహేష్ యాదవ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. భాగ్యవతి యాదవ్ తన జీవితకాలంలో పేద ప్రజల సంక్షేమం, కుటుంబాల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. సమాజ సేవలో ముందుండే ఆమె నేడు మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ఆమె స్మారకార్థం బుధవారం మధ్యాహ్నం 1:00 గంటకు నారాయణగూడలోని వెంకటేశ్వర కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సంతాప సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఆధ్యాత్మిక భజన కార్యక్రమాలతో సభ కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారని వెల్లడించారు.ఈ సమావేశంలో జే. సంతోష్ కుమార్ యాదవ్, జే. పవనిత యాదవ్, జే. ఉమామహేశ్వరి యాదవ్, శ్రీరామ్ యాదవ్, పద్మజ యాదవ్, లాస్య శ్రీ యాదవ్, చోళ సుధాకర్ యాదవ్, హేమంత్ యాదవ్, చోళ వనశ్రీ యాదవ్, సి. సుధాకర్ యాదవ్, ఐశ్వర్య యాదవ్, సర్విక యాదవ్, ఆకాష్ నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సభాధ్యక్ష స్థానంలో శాసనసభను నడిపించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

కరపత్రం ప్రతినిది బ్యూరో, సెప్టెంబర్ 8

తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్యానల్ స్పీకర్ హోదాలో సభాధ్యక్ష స్థానంలో ఆసీనులై సభను నడిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ?సభ సమర్థవంతంగా సాగేందుకు ప్యానల్ స్పీకర్ గా స్పీకర్ స్థానంలో అనుభవజ్ఞుడైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు కూర్చున్నారు. అనంతరం సభలో వివిధ ప్రజాసమస్యలపై జరిగిన చర్చలను ఆయనకు ఉన్న అనుభవంతో చాకచక్యంగా నిర్వహించారు. సభా నియమావళికి కట్టుబడి, ప్రతిపక్ష, అధికార పక్ష సభ్యులకు తగిన సమయాన్ని ఇస్తూ సభను ఎంతో గౌరవప్రదంగా నడిపించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహా బిఆర్ఎస్ నాయకులు తాత మధు, నవీన్ లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బిఆర్ఎస్ నాయకుల ప్రవర్తనకు బాధ్యత తీసుకొని కేసీఆర్ క్షమాపణ చెప్పాలని ప్రవేశపెట్టిన తీర్మాణాన్ని ఏకగ్రీవంగా అమోదించారు. ?మాజీ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ఎంపీగా ఎన్నో ఏళ్ల సుదీర్ఘ రాజకీయ పరిజ్ఞానం కలిగిన కడియం శ్రీహరి సభాధ్యక్ష హోదాలో చూపిన సామర్థ్యం, క్రమశిక్షణ ఆయన పార్లమెంటరీ అనుభవానికి అద్దం పట్టాయి. స్పీకర్ స్థానంలో ఆయన సభను నిర్వహించిన తీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా అభినందించారు.

తల్లిదండ్రుల సమావేశంలో ఉపాధ్యాయుల మధ్య వాగ్వాదం

⬟ పీఎం శ్రీ నిధుల వినియోగంపై భిన్నాభిప్రాయాలు.. విచారణకు స్థానికుల విజ్ఞప్తి

కరపత్రం ప్రతినిది నడికూడ, సెప్టెంబర్ 8

నడికూడ మండలం వరికోలు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. పీఎం శ్రీ పథకం నిధుల వినియోగంపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిసింది. స్థానికుల కథనం ప్రకారం, సమావేశానికి గ్రామ సర్పంచ్, పాఠశాల పాలకవర్గ ప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదని, కొందరు తల్లిదండ్రులను మాత్రమే ఆహ్వానించారనే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సమావేశంలో పీఎం శ్రీ నిధుల వినియోగం, ఖర్చుల వివరాలపై చర్చ సందర్భంగా ఉపాధ్యాయుల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, పాఠశాల నిధుల వినియోగానికి సంబంధించి గతంలోనూ జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిపై నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయంటూ కొందరు ఉపాధ్యాయులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే, ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. మంగళవారం జరిగిన ఘటన అనంతరం ప్రధానోపాధ్యాయుడు శరత్, ఉపాధ్యాయుడు అశోక్‌పై పరకాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటనతో పాటు పాఠశాల నిధుల వినియోగానికి సంబంధించిన అంశాలపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్థులు కోరుతున్నారు.